క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న వీఓఏలు

కర్నూలు(సెంట్రల్): వెలుగు వీఓఏలకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కిసాన్ ఘాట్‌లో వీఓఏల సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడు సంవత్సరాల కాల పరిమితిని తొలగించాలని కోరారు. వేతనాలు సక్రమంగా అందించాలని కోరారు. నాయకులు జే.నాగేశ్వరరావు, వీఓఏలు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీని సందర్శించిన ప్రభుత్వ సలహాదారు



ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న మహమ్మద్ షరీఫ్

కర్నూలు న్యూసిటీ: నగర శివారులోని అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్ సందర్శించారు. అక్కడికి వచ్చిన ఆయన్ను టీడీపీ ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిశారు. ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని స్థానికంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహమ్మద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, జిల్లా అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



బహుమతి అందుకుంటున్న విద్యార్థి ఎం.కె ఆదిత్య

కర్నూలు సిటీ: ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రంగోత్సవ పోటీల్లో రవీంద్ర విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్ కొలాజ్ విభాగంలో విద్యార్థి ఎం.కె ఆదిత్య ప్రథమ బహుమతి సాధించారన్నారు. అక్షరశ్రీ బృందం ద్వితీయ బహుమతి గెలుపొందారని, స్కిప్ట్ (రోల్‌ప్లే) నందు హఫీప బృందం ప్రోత్సాహక బహుమతులు సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఆ విద్యాసంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్, వైస్ చైర్మన్ జి.వంశీధర్, అకడమిక్ అడ్వైజర్ మమతామోహన్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు




అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. వడిబియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: అర్హులైన పేదలందరికీ షరతులు లేకుండా ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్ ఆటో స్టాండ్‌నుంచి వార్డు సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. పేదలు నిర్మించుకునే గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలన్నారు. మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ, నాయకులు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో పీఆర్‌ఓ పోస్టుపై చిన్నచూపు

- సౌకర్యాలు లేవు, గది లేదు, కంప్యూటర్ కూడా లేదు
- ఉద్యోగులు ఆయా రాం.. గయా రాం..
- కమిషనర్ దృష్టి సారించాలంటున్న ఉద్యోగులు



కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పీఆర్‌ఓ పోస్టును అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. 14 సంవత్సరాల క్రితమే ప్రభుత్వం ఈ పోస్టును నగరపాలక సంస్థకు కేటాయించింది. అడపాదడపా ఈ పోస్టులో ఉద్యోగులు పనిచేస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం ఈ విభాగాన్ని ఏనాడు పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో ఈ విభాగానికి గది, కంప్యూటర్ ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పైగా పీఆర్‌ఓగా నియమించిన ఉద్యోగి కమిషనర్ హోదాలో పనిచేశారు. రూ.లక్ష వేతనం తీసుకుంటున్నారు. అయితే ఎక్కడ కూర్చోవాలో తెలియని దుర్భర పరిస్థితి కార్పోరేషన్‌లో నెలకొంది. ఎక్కడపడితే అక్కడ కూర్చునే పరిస్థితి ఉంది. నెలలుగా కార్పొరేషన్‌లో ఇదే పరిస్థితి. ఇక ఫొటోగ్రాఫర్ అస్సలు కార్పొరేషన్‌కు రాడు. ఒక్కరే పనిచేస్తున్నారు. సమాచారం పని అంతా ఒక్కరిపైనే వేశారు. పని చేయని వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

2011 నుంచి పీఆర్‌ఓ పోస్టు ఉన్నా..

నగరపాలక సంస్థకు 2011 సంవత్సరంలో పీఆర్‌ఓ పోస్టు మంజూరయ్యింది. అప్పటి నుంచి పీఆర్‌ఓలు వచ్చి ఇక్కడ పనిచేసిన సంఘటనలు మాత్రం అంతంతే. ఇటీవల పీఆర్‌ఓ పోస్టులో ఆళ్లగడ్డ, డోన్ మున్సిపాల్టీలలో కమిషనర్‌గా పని చేసిన రమేష్ గత ఏడాది నవంబర్ నెల 11వ తేదీ కార్పొరేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. పీఆర్‌ఓ పోస్టు ప్రజా సంబంధాల అధికారిగా ఆయన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. అయితే కార్పొరేషన్‌లో ఎక్కడ కూర్చోవాలో తెలియని పరిస్థితి. కనీసం కూర్చొనేందుకు కుర్చీ కూడా లేదు. ప్రత్యేక గది లేదు. కంప్యూటర్ లేదు. మరి ఎలా విధులు నిర్వర్తించాలి. కార్పొరేషన్‌లో ప్రతి రోజూ ఏదో ఒక కార్యక్రమం ఉంటుంది. దాదాపు ప్రతి రోజూ కార్పొరేషన్‌లో జరిగే కార్యక్రమాలు, కమిషనర్ ప్రకటనలు తదితర వాటిని పత్రికలకు పంపించాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయాలంటే కనీస సదుపాయాలు ఉండాలి. దీనిపై అధికారులు ఏనాడు దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదు. ఒక పీఆర్‌ఓ, ఒక సహాయ ఉద్యోగి, ఇద్దరు ఫొటోగ్రాఫర్లు పనిచేస్తున్నారు. సౌకర్యాలు లేకున్నా ఇంత మంది స్టాఫ్ ఎందుకు ఉన్నారో.. అర్థం కావడం లేదు. ఇద్దరు ఫొటోగ్రాఫర్లు ఏమి చేస్తున్నారు. వీరంతా కార్యాలయానికి వస్తున్నారా.. లేదా.. అన్నది ఏవరు పర్యవేక్షణ చేస్తున్నారు. ఒక ఫొటోగ్రాఫర్ ఏనాడు మున్సిపల్ కార్యాలయానికి రాడు. పని చేయడు. అతను ఎప్పుడు వస్తున్నాడు. ఎక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. ఎందుకు కార్యాలయానికి రావడం లేదు. సంతకాలు చేయడం లేదు. పనిలేని వీరందరికీ వేతనాలు మాత్రం సక్రమంగా అందుతున్నాయి. ఇతర శాఖలకు బదలాయించి పనులు చేయించుకోవచ్చు కదా.. అన్న అభిప్రాయంతోటి ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. కనీసం కార్యాలయానికి రాకున్నా. పని లేకున్నా ఎందుకు వారిని కొనసాగిస్తున్నారంటూ కార్యాలయ ఉద్యోగులు ఫిర్యాదు చేస్తున్నారు. అసలు పీఆర్‌ఓ సైతం అందుబాటులో ఉండడు. ఎప్పుడు వస్తాడో తెలియదు, ఎప్పుడు పోతాడో తెలీదు.

ఒక్క ఉద్యోగి ద్వారానే వాట్సాప్‌లో సమాచారం

సమాచార సేకరణలో పీఆర్‌ఓ, ఇద్దరు ఫొటోగ్రాఫర్లు ఉన్నా.. పనిచేసేది మాత్రం సహాయ ఉద్యోగి ఒక్కరే. ఈయన వాట్సాప్ ద్వారా కార్పొరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు పంపిస్తుంటారు. సెలవులో ఉన్నా ఈయన మాత్రం పనిచేయాల్సి ఉంటుంది. ఈయన మినహా మరెవరూ సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. ఇక్కడ ఒక పీఆర్‌ఓ, ఒక ఫొటోగ్రాఫర్ మాత్రం ఆయారాం.. గయారాం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పనిచేయని వీరికి ప్రతి నెలా జీతాలు మాత్రం సక్రమంగా అందుతున్నాయి. అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వస్తుంటారు. ఒకరిద్దరికీ సంతకాలు కూడా పట్టవు. మూమెంట్ రిజిస్టర్ అంటే ఏందీ అనే పరిస్థితి ఉంది. ఇంత అధ్వానంగా ఉంది పరిస్థితి. నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పందించి ఎప్పుడు కార్యాలయానికి రానీ, సంతకాలు చేయని వీరిని ఇతర విభాగాల్లో కేటాయిస్తే కనీసం పనిచేసినట్లు ఉంటుందన్న అభిప్రాయం కార్యాలయ ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. 6 లక్షల జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న నగరపాలక సంస్థలో ప్రజా సంబంధాల విభాగాన్ని గాడిలో పెట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): జిల్లా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ), మండల స్థాయి లీగల్ సర్వీసెస్ (ఎంఎల్ఎస్‌సీ)లలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి పాసై ఉండి...ఆపై ఉన్నత చదువులు చదివిచట్టం, సామాజిక రంగాల్లో పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. ఉపాధ్యాయులు,పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు,అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతరసభ్యులు, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు, సామాజిక కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుల కోసం జిల్లా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా మండలాస్థాయి లీగల్ సర్వీస్‌లను ఆశ్రయించి పొందాలని, పూరించిన దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా స్థాయి లీగల్ సర్వీసెస్అ థారిటీ లేదా మండలస్థాయి లీగల్ సర్వీసెస్‌కు స్వయంగా లేదా పోస్టు ద్వారా పంపవచ్చని ఆయన వివరించారు.

వేమన పద్యాల్లో ఆత్మ జ్ఞానం

కృష్ణగిరి: సృష్టిలో అందరికీ వర్తించేలా, దైవ జ్ఞానం ఉండేలా వేమన తన పద్యాలు రాశారని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి జోన్ కమిటీ సభ్యులు నాగార్జున అన్నారు. మండల పరిధిలోని కర్లకుంట గ్రామంలో మంగళవారం వారు ఇంటింటికీ తిరిగి వేమన పద్యాల్లోని జ్ఞానం ఆవశ్యకతను వివరించారు. వేమన పద్యం వేయి విధముల అర్థాలు అమరి ఉండవచ్చు కానీ శోధించి చూస్తే అంతా ఆత్మ జ్ఞానమే ఉంటుందని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గుర్తించారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివప్రసాద్, సుంకన్న, శివకుమార్, రామాంజి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



వుడ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న క్రెడాయి కార్యదర్శి బ్రిజేష్ సింగ్

కర్నూలు (టౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని క్రెడాయి (కాన్ఫిడరేషన్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కర్నూలు చాప్టర్ కార్యదర్శి బ్రిజేష్‌సింగ్ సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సౌత్‌జోన్ స్థాయి వుడ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా క్రీడలకు, క్రీడాకారులకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచాయని, తద్వారా క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. వుడ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ కమిషనర్‌ను తొలగించాలి



మాట్లాడుతున్న డీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రనాయుడు

కర్నూలు (సిటీ): రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ విద్యా వ్యవస్థను కాపాడాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశం జరిగింది. డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. గతేడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో 302 జీఓ ఇంటిగ్రేట్ సీనియారిటీ ప్రకారం జరగాల్సిన ప్రిన్సిపాళ్ల ప్రమోషన్లు అందుకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా చేయడం జరిగిందన్నారు. ఇంటర్మీడియెట్ విద్యా వ్యవస్థలో జీఓ నంబర్ 302 ప్రకారం జూనియర్ కాలేజీ లెక్చరర్స్‌కు ప్రిన్సిపళ్లుగా ప్రమోషన్లు వరించేవని..అయితే ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌గా ఉన్న కృతికా శుక్లా ఇచ్చుకో..పుచ్చుకో.. అనే చందంగా నియమ నిబంధనలు, సీనియారిటీ పాటించకుండా ప్రమోషన్లు కల్పించారని ఆరోపించారు. విద్యార్థులకు 50 శాతం పాఠ్యాంశాలు బోధించిన లెక్చరర్లు ప్రమోషన్‌పై ప్రిన్సిపాళ్లుగా వెళ్లిపోవడం వల్ల వారికి పాఠ్యాంశాలు బోధించేవారు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అక్రమ ప్రమోషన్లను రద్దు చేసి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాలను కలుపుకొని విద్యాశాఖ మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయా విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు కిరణ్, ప్రసన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల ఏర్పాటుకు కృషి చేయాలి




వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీపీఓ

కర్నూలు(అర్బన్): గ్రామాలను శుభ్రంగా ఉంచే ప్రక్రియలో భాగంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేయించి ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌బీఎం ద్వారా వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సామాజిక సోక్‌పిట్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని పీఆర్అండ్ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం అమరావతి నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ జీ.నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ.నాగేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి జీ.భాస్కర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. 2 వేల జనాభా కలిగిన గ్రామానికి మూడు ప్రకారం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. అలాగే అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించి అవసరమైన, స్థల లభ్యత కలిగిన ఇంటికి వ్యక్తిగత కంపోస్టు పిట్లు, కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గ్రామాలను స్వచ్ఛమైన, బహిరంగ మల విసర్జన రహిత ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా శాఖలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ప్రతి గ్రామ పంచాయతీని 2026 మార్చి 31వ తేదీలోగా ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌గా డిక్లేర్ చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన మూడవ శనివారం - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా దశలవారీగా అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా తయారు చేయాలన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శాంతికళ

కల్లూరు: పీహెచ్‌సీలోని వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ పి. శాంతికళ అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులు, రిపోర్టులు, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి తక్కువగా ఉందన్నారు. ఆరోగ్య కార్యక్రమాల సర్వేలను వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత మాత్రమే వివాహలు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. మూడేళ్లు తాత్కాలికంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు వాడాలని, ఆ తరువాతనే తల్లికి అవసరమైన శరీర ఆకృతిని కలిగి ఉండడంతో పాటు గర్భం దాల్చడానికి సిద్ధంగా ఉంటారన్నారు. ఆయా కార్యక్రమాలు, విషయాలను గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంఓ నూకరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి మోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



ఆత్మహత్య నివారణ పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(రూరల్): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ శైలేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పంచలింగాల గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాదక ద్రవ్యాల నివారణ, నిర్మూలన, బాల్య వివాహాలు, మానసిక ఆరోగ్యం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానసిక ఒత్తిడికి గురవుతున్న వారితో పాటు ఎలాంటి సమస్యలు ఉన్న విద్యార్థులైనా 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. మానసిక నిపుణులు సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలను వివరిస్తారన్నారు. విద్యార్థి దశ కీలకమని.. భవిష్యత్తు ఈ దశపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. చెడు అలవాట్లు చేసుకుంటే జీవితం దుర్భరంగా మారుతుందని హెచ్చరించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయని.. మొదటి దశలోనే గుర్తిస్తే సరైన కౌన్సెలింగ్ ద్వారా నయం చేసుకోవచ్చని చెప్పారు. వ్యాయామం, యోగా దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, ఎంపీహెచ్‌ఓ మగ్బూల్, మల్లికార్జున భవ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో శ్రీ సక్రవళి తాతా ఉరుసును పురస్కరించుకొని డీలర్ మాదన్న జ్ఞాపకార్థం బుధవారం నుంచి ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు గోపాల్, నాగార్జున, రామాంజి, ఓబులేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మొదటి బహుమతి రూ. 15,016, రెండవ బహుమతిగా రూ. 10,016 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆటల్లో పాల్గొనేవారు రూ. 800 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. వివరాలకు 90104 60061, 83281 31449 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

గురుకులం తనిఖీ



నీటిలో లార్వాపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

వెల్దుర్తి: స్థానిక అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులాన్ని మంగళవారం జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు తనిఖీ చేశారు. ఇటీవల గురుకులం విద్యార్థినికి డెంగీ లక్షణాలు బయటపడడంతో నూకరాజు మంగళవారం గురుకులాన్ని చేరుకుని పరిశుభ్రతపై ప్రత్యేక పరిశీలన చేశారు. తాగునీరు, వాడుకునే నీటి ట్యాంకులు, కొళాయిల వద్ద పరిశీలించారు. విద్యార్థినులతో సమావేశమై పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంచారు. డ్రైనేజీలను, గురుకులం పరిధిలోని వెనుక పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ప్రిన్స్‌పాల్ లక్ష్మీ ప్రసూనను ప్రశ్నించారు. ఆయన వెంట సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, ఏఎన్ఎంలు బుచ్చమ్మ, మునెమ్మ ఉన్నారు.

ఇండస్ట్రియల్ అప్రెంటిషిప్‌పై శిక్షణ



అధ్యాపకులతో జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి

కర్నూలు (సిటీ): ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆర్‌డీఎస్‌డీఈ (రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) విజయవాడ ఆధ్వర్యంలో ఒకేషనల్ లెక్చరర్స్, విద్యార్థులకు ట్వాట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వృత్తి, విద్య అభ్యసించేవారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆర్‌డీఎస్‌డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ బి.అప్పారావు మాట్లాడుతూ.. ఉద్యోగంలో చేరే ముందు విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి అప్రెంటిషిప్ ఉపయోగపడుతుందన్నారు. పరిశ్రమలు సైతం అప్రెంటిషిప్ శిక్షణ పొందిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఒకేషనల్ జూనియర్ లెక్చరర్స్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు (సిటీ): రాష్ట్ర ఒకేషనల్ జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా విభాగం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి, ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి జీవీఎస్ గురువయ్య శెట్టి స్థానిక ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఒకేషనల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ప్రాక్టికల్ పరీక్షలు మొదలుకానున్నాయని, వాటిని విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. జిల్లా ఒకేషనల్ జూనియర్ కళాశాలల ప్రెసిడెంట్ కొంకతి వేణుగోపాల్, సెక్రటరీ ఎస్.దేవదానం, ట్రెజరర్ బి.సునీల్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మాటలు కాదు.. అభివృద్ధి చేసి చూపండి



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎండమావులను చూపి అభివృద్ధి చేసినట్లు చెబుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి విమర్శించారు. రాయలసీమ కోసం రూ.80 వేల కోట్లతో గోదావరి జలాలు తేస్తానని చెప్పడం ఎండమావి అవుతుందన్నారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి జలాలను బానకచర్లకు తెచ్చేందుకు చేసే ఖర్చుతో గుండ్రేవుల, ఆర్‌డీఎస్, వేదవతి ప్రాజెక్టులను పూర్తిచేస్తే సీమ జిల్లాలకు సస్యశ్యామలంగా మార్చవచ్చన్నారు. కేవలం క్రాంట్రాక్టుల కోసం గోదావరి జలాలను రాయలసీమకు తేస్తానని చెప్పడం అన్యాయమన్నారు. దీనివల్ల రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు రామకృష్ణ, నారాయణ, అంజిబాబు, ఆనంద్‌బాబు, రాముడు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు

- 128 మద్యం బాటిళ్లు సీజ్
- ఆరుగురిపై కేసు నమోదు



అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

కర్నూలు: అక్రమ మద్యం విక్రయాలపై ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి మంగళవారం కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇ.తాండ్రపాడు, ఉల్చాల, మునగాలపాడు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న స్థావరాలపై దాడులు జరిపి 128 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మునగాలపాడు గ్రామంలో వెంకటేశ్వరమ్మ వద్ద 15, మహేశ్వరమ్మ వద్ద 18, ఉల్చాల గ్రామానికి చెందిన వడ్డె రామకృష్ణ వద్ద 16, వడ్డె సుంకులమ్మ వద్ద 30, ఇ.తాండ్రపాడు గ్రామంలో తెలుగు శ్రీనివాసులు వద్ద 25, గొల్ల రాంపుల్లయ్య వద్ద 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు రెహనా బేగం, ఇందిరా కిరణ్, తేజ, స్టేషన్, డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు.. ఇంటికి వెలుగు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఐఓ

కోడుమూరు రూరల్: ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగునిస్తుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ నాగప్రసాద్ బాబు సూచించారు. మంగళవారం గూడూరు బాలికల హైస్కూల్‌లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలిక విద్యా ప్రాధాన్యతపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వివాహాలు చేస్తే శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు వస్తాయని తెలిపారు. చదువుతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనవసర విషయాల జోలికి వెళ్లకుండా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రత్యూష, హెల్త్ ఎడ్యుకేటర్ క్రిష్ణారెడ్డి, సూపర్‌వైజర్ రాఘవయ్య, హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.